





# కరపత్రం

SINCE 2014

సోమవారం ఆగస్ట్ 17, 2026 | సంపుటి : 2 | సంచిక : 306 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## సొంత చెల్లికే న్యాయం చేయలేని వారు..

# 2 కోట్ల మంది ఆడబిడ్డలకు చేస్తారా?

- మేడారం అభివృద్ధిపై సీఎం రేవంత్ హామీ
- రూ.868 కోట్ల పనులకు శ్రీకారం
- సీతక్కను సొంత ఆడబిడ్డలా చూస్తున్నాం
- బీఆర్ఎస్‌పై రేవంత్ తీవ్ర విమర్శలు
- మల్లూరు ఆలయం, జంపన్నవాగు అభివృద్ధికి హామీ
- రేవంత్ నాయకత్వంలో ములుగు అభివృద్ధి: సీతక్క



**ములుగు:**
మేడారంలో వనదేవతలను బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క, సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ములుగు జిల్లాలో సీఎం పర్యటించారు.
తొలుత మేడారంలో పర్యటించిన సీఎం.. వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ములుగు చేరుకుని గట్టమ్మ దేవాలయం వద్ద హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించారు. ములుగు జిల్లాలో రూ.868 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు.
"ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ములుగు నుంచే పాదయాత్ర మొదలు పెట్టాం. పోరాటానికి, పౌరుషానికి మారుపేరైన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని పాదయాత్ర చేపట్టాం. ప్రజల సమస్యలు తెలుసుకుని తీరుస్తామని హామీ ఇచ్చాం. మీ ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చాం. మల్లూరు నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తాం. జంపన్న వాగును కూడా నూటికి నూరు శాతం అభివృద్ధి చేస్తాం. ములుగు ప్రాంత అభివృద్ధికి ఏం కావాలో చెబితే నిధులు మంజూరు చేస్తాం.

**సీతక్కను సొంత ఆడబిడ్డలా..**
రక్తం పంచుకు పుట్టకపోయినా సీతక్కను సొంత ఆడబిడ్డగా చూసుకుంటున్నాం. కొందరు ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లినే బయటకు నెట్టారు. సొంత చెల్లికే న్యాయం చేయని వారు.. రాష్ట్రంలోని 2 కోట్ల మంది ఆడబిడ్డలకు న్యాయం చేస్తారా? కుమారుడు దౌర్జన్యం చేస్తుంటే మందలించాల్సిన తండ్రి ఫాంహౌస్‌లో పడుకున్నారు. సొంత బిడ్డను ఇంటి నుంచి బయటకు వెళ్లగొడుతుంటే మౌనంగా ఉన్నారు. కుమారుడు చేసిన నేరంలో తండ్రికి కూడా సగభాగం ఉన్నట్లే. అలాంటి తండ్రీకుమారులు రాష్ట్రానికి పట్టిన శనీశ్వరులు. ఇంకొకరు అఘోరారావు.. అఘోరా పూజలు చేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడాలని కోరుకున్నారు. దేవుడు మనవైపు ఉన్నాడు.. వర్షాలు కురిపించాడు.

**రేవంత్ నాయకత్వంలో ములుగు అభివృద్ధి: మంత్రి సీతక్క**
ములుగు అంటే గతంలో అభివృద్ధి లేని ప్రాంతం అనేవారని మంత్రి సీతక్క అన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో ఈ జిల్లా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. "పదేళ్లు కొట్లాడితే ములుగు జిల్లా ఇచ్చారు. ఏడాదిలో మూడుసార్లు వనదేవతలను దర్శించుకున్న సీఎం రేవంత్. రాష్ట్రంలో ఏ జిల్లాకూ ఇవ్వనన్ని ఇందిరమ్మ ఇళ్లు ములుగు జిల్లాకు ఇచ్చారు" అని చెప్పారు.

## సోనియా గాంధీ దేశ ప్రజలకు

# క్షమాపణ చెప్పాలి: అమిత్ షా



కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా (విమర్శలు గుప్పించారు. శనివారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా సోనియా అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనను దేశ ప్రజలందరూ కళ్లారా చూశారని పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గేయాన్ని అవమానించారని మండిపడ్డారు. ఆ పార్టీని దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరని అన్నారు. వందేమాతరాన్ని అవమానించినందుకు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు సిగ్గుచేటని విమర్శించారు. రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**పోలీసుల అదుపులో విద్యార్థులు..**
అమిత్ షా పర్యటనకు ముందు కాంగ్రెస్ నాయకులతో పాటు పలువురు విద్యార్థులను రాజస్థాన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమిత్‌షా ర్యాలీ నేపథ్యంలో నిరసన చేపట్టడానికి విద్యార్థులతో పాటు ఇరవై నాలుగు మంది కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించారు. పేపర్ లీక్‌లు, ఢిల్లీలో విద్యార్థులపై దాడులపై కేంద్రమంత్రి స్పందించాలని డిమాండ్ చేస్తూ.. నిరసన చేపట్టారు. దీంతో వారిని అక్కడి నుంచి బలవంతంగా తరలించారు. ఈ అరెస్టులకు నిరసనగా వందల మంది కాంగ్రెస్ కార్యకర్తలు, విద్యార్థులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు.

## పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ ఏం చేశారు: బండి సంజయ్



- కేటీఆర్ వ్యాఖ్యలపై బండి సంజయ్ విమర్శలు
- మంచి స్కూళ్లు, కాలేజీలు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్న
- సరిపడా టీచర్లను ఎందుకు నియమించలేదని నిలదీత
- యూనివర్సిటీల్లో ఖాళీలు ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్న
- స్కూళ్లు, కాలేజీలపై కేసీఆర్ కుటుంబమే విమర్శలు చేస్తోందని వ్యాఖ్య

**హైదరాబాద్:**
భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. " భారత్‌లో మంచి కాలేజీలు లేవని కేటీఆర్ అంటున్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఏం చేశారు? రాష్ట్రంలో మంచి స్కూళ్లు, కాలేజీలు ఎందుకు ఏర్పాటు చేయలేదు? పదేళ్ల పాటు సరిపడా టీచర్లను ఎందుకు నియమించలేదు? యూనివర్సిటీల్లో ఖాళీలను ఎందుకు భర్తీ చేయలేదు? స్కూళ్లు బాగాలేవని కొన్నాళ్ల క్రితం కేసీఆర్ మనవడు చెప్పారు. కాలేజీలు బాగా లేవని ఇప్పుడు కేసీఆర్ మనవరాలు చెబుతోంది" అని బండి సంజయ్ అన్నారు.

## రెండో ఉద్యమం మొదలు పెట్టిన

# సీజేపీకి బిగ్ షాక్.. ఒకరి మృతి

- » పాఠశాల వీడియో తీసినందుకు దాడి
- » గాయాలతో అబ్దుల్ తండ్రి మృతి
- » బీజేపీ కార్యకర్తలే కారణమంటూ ఆరోపణలు
- » నిందితులు అదుపులో: పోలీసులు
- » కఠిన చర్యలు తీసుకుంటాం: బీజేపీ
- » న్యాయం కోసం పోరాడతాం: సీజేపీ




**న్యూఢిల్లీ:**
'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమం చేపట్టిన రెండో రోజే సీజేపీకి భారీ షాక్ తగిలింది. పాఠశాల సమస్యలను అందరి దృష్టికి తీసుకురావాలనుకున్న సీజేపీ మద్దతుదారుడి తండ్రిని కొందరు కొట్టి చంపారు. పశ్చిమ బెంగాల్‌లోని బంకురాకు చెందిన కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారుడి తండ్రి ఆగస్టు 15న మృతి చెందారు.సీజేపీ చేపట్టిన 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారంలో భాగంగా తన చిన్నతనంలో చదువుకున్న పాఠశాల పరిస్థితులను అతడి కుమారుడు వీడియో తీసినందుకు ఆగ్రహించిన కొందరు వ్యక్తులు ఇంట్లోనే ఆయనపై దాడి చేశారని పోలీసులు, కుటుంబ సభ్యులు ఆదివారం జాతీయ మీడియాకు తెలిపారు.
మృతుడి కుమారుడి పేరు అబ్దుల్ హఫీజ్. దాడికి బీజేపీ కార్యకర్తలే కారణమని ఆరోపించిన అబ్దుల్ హఫీజ్.. దాడిలో గాయపడిన తన తండ్రి బంకురాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. "ఈ బీజేపీ స్థానిక నేతలు దారుణంగా దాడి చేసిన తర్వాత నా తండ్రి శనివారం మృతి చెందారు" అని హఫీజ్ చెప్పారు.

2లో..

## 'నేను ఎక్కడికీ పోను..

# ఖమ్మం నుంచే పోటీ చేస్తా'

- » తుమ్మలపై పువ్వాడ అజయ్ విమర్శలు
- » ఖమ్మం అభివృద్ధిలో తుమ్మల పాత్ర లేదని వ్యాఖ్య
- » హైవే నిర్మించింది కేంద్ర ప్రభుత్వమే: పువ్వాడ
- » అధికార పార్టీ కక్షపూరిత కేసులు పెడుతోందని ఆరోపణ
- » అధికారంలోకి వచ్చాక సమాధానం చెబుతామని హెచ్చరిక
- » పార్టీ మారే ప్రసక్తే లేదు.. ఖమ్మం నుంచే పోటీ: పువ్వాడ



**ఖమ్మం:**
మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఉద్దేశించి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శలు గుప్పించారు. తుమ్మల ఏ పార్టీలో ఉన్నా పదవులు అనుభవించారే తప్పా, ఖమ్మం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. ఖమ్మం-దేవరపల్లి హైవేను నిర్మించింది కేంద్ర ప్రభుత్వం, ఇందులో తుమ్మలకు ఏమీ సంబంధం లేదన్నారు.
అధికార పార్టీ తమపై కక్ష పూరితంగా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చాక ప్రతీ దానికి సమాధానం చెప్తామని పువ్వాడ హెచ్చరించారు. పదవులు అనుభవించిన వారే గోడ దూకి పార్టీలు మారారని, అధికారంలో ఉన్నప్పుడు కొందరు ఇప్పుడు మారినా తమకేం ఇబ్బంది లేదన్నారు. తాను ఎక్కడికీ పోవడం లేదని, ఖమ్మం నుంచే పోటీ చేస్తానన్నారు.



2లో..

## ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి పొన్నం లేఖ

- 2027 జనాభా లెక్కల్లో ఓబీసీలకు ప్రత్యేక కేటగిరీ కోరిన పొన్నం
- ఓబీసీ, ఎస్ఈబీసీలకు ప్రత్యేక కులగణన విధానం ఉండాలని విజ్ఞప్తి
- జనాభా లెక్కల్లో ప్రతి కులానికి డిజిటల్ కోడ్‌లు ఇవ్వాలని సూచన
- బీసీల పూర్తి సమాచారం సేకరించాలి: పొన్నం
- SECC-2011 సమస్యలు పునరావృతం కాకూడదని లేఖలో ప్రస్తావన
- తెలంగాణ కులగణన అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి



2లో

## అందుకే కొండా సురేఖ దూరంగా ఉన్నారా?

**పరకాల:**
ఒకవైపు సీఎం రేవంత్ పర్యటనకు మంత్రి కొండా సురేఖ దూరం.. మరొకవైపు వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి రేవూరి పోటీచేస్తారని రేవంత్ వ్యాఖ్యలు.. వీరి మధ్య దూరం పెరిగిందనే వాదనకు బలం ఇస్తోంది. తాజాగా సీఎం రేవంత్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో కార్యక్రమాలకు మంత్రి కొండా సురేఖ గైర్హాజరయ్యారు.



## భవనం పైనుంచి దూకి వైద్యవిద్యార్థి ఆత్మహత్య

**ఉప్పల్ (హైదరాబాద్):**
నగరంలోని ఉప్పల్ పీఎస్ పరిధిలో వైద్యవిద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రామంతాపూర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి దూకి కౌల్కూరి భరద్వాజ్ (18) బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడు ఉస్మానియా వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అవార్డు అందుకుని.

### 24 గంటల వ్యవధిలోనే యువకుడి మృతి



**గద్వాల అర్బన్:**
108 అంబులెన్స్‌లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న యువకుడు గుండెపోటుతో మృతి చెందారు. గద్వాల మండలం చెనుగొనిపల్లికి చెందిన జహంగీర్ బాషా (28)కు అర్ధరాత్రి ఛాతీలో నొప్పి రావడంతో అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శనివారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా బాషా.. ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న 24 గంటల వ్యవధిలోనే కుమారుడు గుండెపోటుతో మృతిచెందడంతో అతని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## నవంబరు నెల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా 18న విడుదల

**తిరుమల:**
నవంబరులో జరిగే శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాద పద్మారాధన సేవల కోటాను ఈ నెల 18న ఉదయం పది గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.



2లో..

## రెండో ఉద్యమం మొదలు పెట్టిన సీజేపీకి బిగ్ షాక్.. ఒకరి మృతి

మొదటిపేజీ తరువాయి

బంకురా ఎస్పీ వీజీ సతీష్ పసుమర్తి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. “హఫీజ్ తల్లి ఫిర్యాదు చేసేందుకు వస్తున్నట్లు మాకు సమాచారం అందింది. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం” అని చెప్పారు.

ఇదిలా ఉండగా, తమ కార్యకర్తలకు ఈ ఘటనతో సంబంధం ఉన్నట్లు తేలి, వారిపై పేర్లతో పోలీసులకు ఫిర్యాదు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని బీజేపీ తెలిపింది. “అయితే, టీఎంసీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ వ్యక్తి సామాజిక తనిఖీ చేసే ధైర్యం చేశారా? కొత్తగా అధికారంలోకి వచ్చిన బీజేపీని చెడుగా చూపించేందుకు టీఎంసీ, వామపక్షాలు చేస్తున్న పద్ధతి ఇది మాత్రమే” అని బీజేపీ బెంగాల్ అధికార ప్రతినిధి కేయా ఘోష్ చెప్పారు.

జంతర్ మంతర్‌లో జరిగిన సీజీపీ నిరసనల్లో కూడా పాల్గొన్న హఫీజ్.. పాఠశాలల మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు సామాజిక తనిఖీలో భాగస్వామి కావాలని అనుకున్నట్లు తెలిపారు. తాను చదువుకున్న కరిసుంద ప్రాథమిక విద్యాలయానికి వెళ్లి కొన్ని వీడియోలు తీసుకుని ఇంటికి తిరిగి వచ్చానని చెప్పారు.

రాత్రి 8 గంటల సమయానికి కొందరు వ్యక్తులు తన ఇంటికి వచ్చి చుట్టుముట్టారని, తనపై కూడా దాడి చేయడంతో పాటు వృద్ధుడైన తన తండ్రిని కొట్టారని హఫీజ్ తెలిపారు. తన ఫోన్‌ను లాక్కుని, పాఠశాలకు సంబంధించిన వీడియోలు, జంతర్ మంతర్‌లో తాను తీసిన వీడియోలను తొలగించాలని బలవంతం చేశారని చెప్పారు.

### నా రక్తం మరిగిపోతోంది: దీప్కే

అబ్దుల్‌కు కాక్రోచ్ జనతా పార్టీ (సీజీపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అబ్దుల్‌కు మద్దతు తెలిపారు. అతడి తండ్రి మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై మాట్లాడిన తర్వాత అబ్దుల్ ఆ పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లారని దీప్కే ఎక్స్‌లో చేసిన పోస్టులో తెలిపారు. అబ్దుల్, ఆయన కుటుంబంపై బీజేపీతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు దాడి చేసిన తర్వాత ఆయన తండ్రి హత్యకు గురయ్యారని దీప్కే ఆరోపించారు.

“మెరుగైన పాఠశాలలు కావాలని డిమాండ్ చేసినందుకు ప్రజలను హత్య చేస్తున్నారంటే నా రక్తం మరిగిపోతోంది” అని దీప్కే పోస్టులో పేర్కొన్నారు. సీజీపీ బృందం పశ్చిమ బెంగాల్‌కు వెళ్లి అబ్దుల్, ఆయన కుటుంబంతో కలిసి న్యాయం కోసం పోరాడుతుందని దీప్కే తెలిపారు. బెదిరింపులు, భయపెట్టే ప్రయత్నాలు ఎదురైనా.. మెరుగైన ప్రభుత్వ పాఠశాలల కోసం తమ ప్రచారాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ ప్రాథమిక సదుపాయాల్లో ఉన్న లోపాలను ఎత్తిచూపుతున్న ‘స్కూల్ ఠీక్ కరో’ ప్రచారాన్ని దీప్కే ప్రారంభించిన తర్వాత ఆయన ఈ పోస్టు చేశారు.

## అందుకే కొండా సురేఖ దూరంగా ఉన్నారా?

మొదటిపేజీ తరువాయి

దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ లేకుండానే మేడారం సమ్మక్క-సారలమ్మ అభివృద్ధి పనులను పరిశీలించారు సీఎం రేవంత్. మరొకవైపు రేవంత్ పరకాల సభలోనూ కొండా సురేఖ కనిపించలేదు. దాంతో ఈ అంశం తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది.

మరొకవైపు వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి రేవూరి పోటీ చేస్తారని రేవంత్ చెప్పడం మరింత హాట్ టాపిక్ అయ్యింది. రేవూరిని ఆశీర్వదించాలని కూడా రేవంత్ పిలుపునిచ్చారు. అయితే వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేస్తానని కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే సీఎం ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలకు దూరంగా ఉన్నారనే చర్చ మొదలైంది.

## ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి పొన్నం లేఖ

మొదటిపేజీ తరువాయి

2027 జనాభా లెక్కల్లో ఓబీసీలకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధానికి లేఖ రాశారు పొన్నం. ‘ ఓబీసీ, ఎస్ఈబీసీల సమగ్ర కులగణకు ప్రత్యేక విధానం రూపొందించాలి. ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీలకు ప్రశ్నావళిలో ప్రత్యేక కేటగిరి చేర్చాలి. ప్రతి కులం, సముదాయానికి డిజిటల్ కోడ్‌లు కేటాయించాలి.

కులగణనలో బీసీల సమాచారాన్ని సేకరించాలి. బీసీల లెక్కలు తేలితేనే సామాజిక న్యాయం జరుగుతుంది. SECC-2011లో ఎదురైన కులపేర్ల సమస్యలు 2027 జనాభా లెక్కల్లో పునరావృతం కాకూడదు.

రాష్ట్రాల వారీగా మాస్టర్ కుల డైరెక్టరీ.. ప్రతి కులం, సముదాయానికి డిజిటల్ కోడ్‌లు ఇవ్వాలి. స్థానిక, వివాదాస్పద కులపేర్ల నమోదుకు ప్రత్యేక ధృవీకరణ విధానం ఉండాలి. వ్యక్తి స్వయంగా ప్రకటించిన కులం, అధికారిక వర్గీకరణ రెండింటినీ డేటాలో భద్రపరచాలి. తెలంగాణ కులగణన సర్వే అనుభవాలను 2027 జనాభా లెక్కల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవాలి’ అని లేఖలో పేర్కొన్నారు.

## నవంబరు నెల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా 18న విడుదల

మొదటిపేజీ తరువాయి

ఎంపికైన భక్తులు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం లోపు సొమ్ము చెల్లించి లక్కీడిప్ టికెట్లు పొందాల్సి ఉంటుంది.

ఈ నెల 21న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, సాలకట్ల పవిత్రోత్సవాల టికెట్లను ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు.

24న ఉదయం పది గంటలకు అంగప్రదక్షిణం, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన కోటా, మధ్యాహ్నం మూడు గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు.

25న ఉదయం పది గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. https://ttdevasthanams.ap.gov.in/ వెబ్‌సైట్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.

## సయ్యుంటోంది.. సైనిక కీటకం

మినీ జెట్ ఫైటర్ లాంటి ఆకారం.. సైనికుడి దుస్తుల్లాంటి రెక్కలతో యుద్ధానికి సిద్ధం అవుతున్నట్టుగా ఉన్న ఈ కీటకం ఒలియాండర్ హాక్ మాత్. చెట్ల ఆకుల్లో ఇట్టే కలిసిపోతుంది. శనివారం ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని గంపోనిగూడెంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొండా చెంచయ్య ఇంటి ఆవరణలో కనిపించింది.



# వందే భారత్ ఢీ కొని యువతి మృతి!
# మౌలాలి వద్ద విషాద ఘటన

మౌలాలి వద్ద విషాద ఘటన చోటుచేసుకుంది. జనగాం నుంచి తల్లిదండ్రులతో కలిసి వచ్చిన 20 ఏళ్ల నర్స్ మానేపల్లి మానస వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని మృతి చెందింది. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో మౌలాలి చేరుకున్న అనంతరం ప్లాట్‌ఫామ్ మారేందుకు పట్టాలు దాటే క్రమంలో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

వందే భారత్ ఢీ కొని యువతి మృతి! మౌలాలి వద్ద విషాద ఘటన తల్లిదండ్రులతో కలిసి రైలులో ప్రయాణించింది.. గమ్యస్థానానికి చేరుకుని రైలు దిగింది.. మరికొద్ది క్షణాల్లోనే ఊహించని ప్రమాదం ఆమె ప్రాణాలను బలితీసుకుంది. జనగాం నుంచి తల్లిదండ్రులతో కలిసి వచ్చిన 20 ఏళ్ల నర్స్ మానేపల్లి మానస వందేభారత్ రైలు ఢీకొని మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మృతురాలిని మానేపల్లి మానస (20) నర్సుగా పనిచేస్తున్న మానస చిన్న వయసులోనే ఇలా రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.



### అసలు ఏం జరిగింది?

ఆదివారం, ఆగస్టు 16న మధ్యాహ్నం 3 గంటలలోపు మౌలాలి రైల్వే ఎల్‌సీ గేట్ నంబర్-6 సమీపంలోని అప్‌లైన్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మానస తన తల్లిదండ్రులతో కలిసి జనగాం నుంచి మౌలాలి వరకు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించింది. మౌలాలి వద్ద రైలు దిగిన తర్వాత ప్లాట్‌ఫామ్ నంబర్-2 నుంచి ప్లాట్‌ఫామ్ నంబర్-1 వైపు వెళ్లే క్రమంలో పట్టాల దాటే సమయంలో ఘటన చోటు చేసుకుంది. అదే సమయంలో విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఆ మార్గంలో దూసుకొచ్చింది. మానసను రైలు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

### క్షణాల వ్యవధిలో విషాదం..

గోల్కొండ ఎక్స్‌ప్రెస్ నుంచి దిగిన తర్వాత మానస పట్టాల వైపు ఎందుకు వెళ్లింది? వందేభారత్ వస్తున్న విషయాన్ని గమనించలేదా? ప్లాట్‌ఫామ్ మారేందుకు పట్టాలు దాటేందుకు ప్రయత్నించిందా? ప్రమాదానికి ముందు అక్కడ పరిస్థితులు ఎలా ఉన్నాయి? అనే అంశాలపై రైల్వే పోలీసులు ఆరా తీస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు క్రైమ్ నంబర్ 418/2026 కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రాథమికంగా ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా కనిపిస్తున్నప్పటికీ, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతోంది. వృత్తిరీత్యా నర్స్ అయిన 20 ఏళ్ల మానస.. అనారోగ్యంతో బాధపడేవారికి సేవలు అందిస్తూ ప్రాణాలు కాపాడే వృత్తిని ఎంచుకుంది. కానీ విధి మరోలా రాసింది. తల్లిదండ్రులతో కలిసి చేసిన సాధారణ రైలు ప్రయాణమే ఆమెకు చివరి ప్రయాణంగా మారింది. కళ్లముందే కుమార్తెను కోల్పోయిన ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. జనగాంలో మొదలైన కుటుంబ ప్రయాణం.. మౌలాలి వద్ద తీరని విషాదంతో ముగిసింది. కేవలం కొన్ని క్షణాల్లో జరిగిన ఈ ప్రమాదం ఒక కుటుంబానికి జీవితాంతం మిగిలిపోయే దుఃఖాన్ని మిగిల్చింది.

# ఫోన్, ల్యాప్‌టాప్ ఛార్జింగ్ పెట్టి వదిలేస్తున్నారా?..
# ఈ షాకింగ్ ఘటన చూస్తే వణుకు పుట్టాల్సిందే..!

ఎలక్ట్రానిక్ పరికరాల ఛార్జింగ్ విషయంలో అప్రమత్తత అవసరమని నిపుణులు సూచిస్తుంటారు. రామంతాపూర్ హాస్టల్ ఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. కానీ ఛార్జింగ్ విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా అగ్నిప్రమాదానికి కారణమయ్యే అవకాశం ఉందనే హెచ్చరికను మాత్రం ఈ ఘటన..

చెప్పడానికి చిన్న ఘటనలా అనిపించొచ్చు.. కానీ వినడానికి, చూడటానికి మాత్రం ఆందోళన కలిగించే విషయం. మనం రోజూ ఉపయోగించే ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు సహా ఎలక్ట్రానిక్ పరికరాలను ఛార్జింగ్ పెట్టే సమయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రమాదానికి దారితీయొచ్చని హైదరాబాద్‌లో జరిగిన తాజా ఘటన మరోసారి గుర్తుచేసింది. హైదరాబాద్ ఉప్పల్ పరిధిలోని రామంతాపూర్‌లో ఉన్న నెస్ట్ హాస్టల్‌లో స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాప్‌టాప్ ఛార్జింగ్ సమయంలో అధిక వేడి కారణంగా మంటలు చెలరేగినట్లు అధికారులు తేల్చారు

### ఛార్జింగ్ పెట్టారు.. ఒక్కసారిగా మంటలు

హాస్టల్‌లో ల్యాప్‌టాప్ ఛార్జింగ్‌లో ఉండగా అది వేడెక్కి మంటలు వచ్చినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. దీంతో అక్కడున్నవారు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటన స్వల్ప



అగ్నిప్రమాదంతో ముగియడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ల్యాప్‌టాప్‌లోనే సమస్య వచ్చిందా? ఛార్జర్ లేదా బ్యాటరీ వేడెక్కిందా? విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమా? అన్నది అధికారులు టెక్నికల్‌గా విచారణ ప్రారంభించారు.

### మీ ల్యాప్‌టాప్ కూడా ఛార్జింగ్‌లో వేడెక్కుతోందా?

ఈ ఘటన నేపథ్యంలో ఎలక్ట్రానిక్ పరికరాల ఛార్జింగ్ విషయంలో అప్రమత్తత అవసరమని నిపుణులు సూచిస్తుంటారు. ముఖ్యంగా ల్యాప్‌టాప్‌ను బెడ్, దిండు, దుప్పటి వంటి వేడిని బయటకు వెళ్లనివ్వని ఉపరితలాలపై ఉంచి ఛార్జింగ్ చేయకుండా గాలి ప్రసరణ ఉండే గట్టి ఉపరితలంపై ఉంచడం మంచిది. దెబ్బతిన్న వైర్లు, నాసిరకం లేదా సరిపోని ఛార్జర్లు ఉపయోగించకపోవడం, బ్యాటరీ అసాధారణంగా వేడెక్కినా లేదా ఉబ్బినట్లు కనిపించినా వెంటనే వినియోగాన్ని నిలిపివేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువసేపు పరికరాలను పర్యవేక్షణ లేకుండా ఛార్జింగ్‌లో వదిలేయకుండా ఉండటం కూడా సురక్షితం.

రామంతాపూర్ హాస్టల్ ఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. కానీ ఛార్జింగ్ విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా అగ్నిప్రమాదానికి కారణమయ్యే అవకాశం ఉందనే హెచ్చరికను మాత్రం ఈ ఘటన మరోసారి ముందుకు తెచ్చింది.

# ఆస్తి ఆశతో దారుణ హత్యలు..
# సీసీటీవీ దృశ్యాలతో కిల్లర్ తల్లి, కొడుకు అరెస్ట్!

దుబ్బాక మండలం రామక్కపేట శివారులో ఈ నెల 8వ తేదీన జరిగిన మహిళ దహనం కేసు సిద్దిపేట పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది.రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో విచారణ జరపగా నమ్మలేని నిజాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు ఇచ్చిన సమాచారం, స్థానికుల వివరాల ప్రకారం.. భూంపల్లికి చెందిన విజయ(45) అనే మహిళను పక్కా స్కెచ్‌తో హతమార్చింది మరెవరో కాదు..రజిత(38) అనే మహిళ, ఆమె మైనర్ కుమారుడు...డబ్బుపై వ్యామోహంతో ఈ తల్లి, కుమారుడు అత్యంత క్రూరంగా ప్రవర్తించారు. విజయకు ఉన్న కుటుంబ గొడవలను ఆసరాగా చేసుకుని, ఆమెను తమ ఇంటికి పిలిపించారు. నమ్మకంగా ఇంట్లోకి తీసుకెళ్లి.. తల్లి, కొడుకు కలిసి విజయ గొంతు పిసికి దారుణంగా హత్య చేశారు.




ఆ తర్వాత శవాన్ని మాయం చేసేందుకు సినిమా ఫక్కీలో ప్లాన్ వేశారు. రాత్రి సమయంలో మృతదేహాన్ని టీవీఎస్ ఎక్స్ఎల్ బైక్‌పై మధ్యలో కూర్చోబెట్టుకుని రామక్కపేట శివారుకు తరలించారు. అక్కడ పెట్రోల్ పోసి మృతదేహాన్ని పూర్తిగా తగలబెట్టారు. విజయ ఒంటిపై ఉన్న బంగారాన్ని దోచుకున్నారు..వీరు చేసిన పనులు అన్ని సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి..పోలీసుల విచారణలో తేలిన నిజాలు చూసి ఖాకీలే ముక్కున వేలేసుకున్నారు..

ఈ కిల్లర్ తల్లి, కుమారుడు ఇలాంటి హత్య చేయడం ఇదే మొదటిసారి కాదు. గత మే నెలలోనూ రేఖ అనే మరో మహిళను వీరు ఇదే తరహాలో గొంతు పిసికి చంపేశారు. అనంతరం శవాన్ని అచ్చుమయిపల్లి అడవిలోకి తీసుకెళ్లి తగలబెట్టారు. ఆస్తి గొడవలు, కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న మహిళలనే ఈ ముఠా టార్గెట్ చేస్తోంది. వారిని నమ్మించి, గొంతు కోసి, ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లడమే వీరి ప్రధాన వృత్తిగా మార్చుకున్నారు.. ఈ ఇద్దరు కిల్లర్స్ ఇంతటితో ఆగలేదు. ఈజీ మనీ కోసం మరో నలుగురు మహిళలను హత్య చేసేందుకు ఇప్పటికే టార్గెట్ లిస్ట్ సిద్ధం చేసుకున్నట్లు పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. అప్రమత్తమైన పోలీసులు అరెస్ట్ చేసి,తల్లిని జైల్ కి పంపగా.. కొడుకును జ్యూవెయినల్ హోమ్ కి తరలించారు.

## స్కిల్స్ పెంచుకుంటే.. విదేశాల్లో ఉద్యోగం..ఏడాదికి 25లక్షల జీతం: మంత్రి వివేక్

మహబూబ్ నగర్: గ్రామీణ యువతకు స్కిల్స్ డెవలప్ మెంట్ శిక్షణ ఇచ్చేందుకు ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు మంత్రి వివేక్ వెంటకస్వామి. ఆదివారం (ఆగస్టు16) మహబూబ్ నగర్ లో ఏటీసీ సెంటర్ ను ప్రారంభించిన మినిస్టర్.. మారుమూల ప్రాంతాల్లో విద్యార్థులు టెక్నికల్ విద్య నేర్చుకోవడం ద్వారా స్కిల్స్ పెంచుకోవాలన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా 4వేల కోట్లతో 117 ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్కిల్స్ పెంచుకుంటే విదేశాల్లో లక్షల




ఉద్యోగాలు వస్తాయన్నారు. స్కిల్ తో ఏడాదికి 25 లక్షల జీతంతో జర్మనీ, జపాన్ లో యువతకు 25 లక్షల ఉద్యోగాలున్నాయన్నారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం ఏనాడూ విద్యార్థులను పట్టించుకోలేదు.. ఇప్పుడు మాప్రభుత్వం విద్యార్థుల్లో స్కిల్ డెవలప్ మెంట్ కు కృషి చేస్తుంటే సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోందన్నారు .జర్మన్ భాష నేర్చుకోవడం ద్వారా లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి జరుగుతోందన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో దోచుకుందన్నారు ..తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. దేవరకద్ర బీడీ కార్మికులకోసం త్వరలో డిస్పెన్సరీ ఏర్పాటు చేస్తామని హామి ఇచ్చారు మంత్రి వివేక్ వెంకటస్వామి.

# కుల గణనపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

▪ కుల గణనతో బీసీల జనాభా వాస్తవికంగా తేలనుంది: గుజ్జ సత్యం



కరపత్రం ప్రతినిది హైదరాబాద్, ఆగస్టు 16

దేశ వ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో కుల గణనను కూడా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం స్వాగతించారు. కుల గణనకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం తీసుకోవడం దేశంలోని బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ స్థితిగతులను వాస్తవ గణాంకాలతో అంచనా వేసేందుకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆదివారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశ జనాభాలో బీసీల వాటా ఎంత ఉందో కచ్చితంగా తెలుసుకోవాలంటే జనగణనలో కులాల వారీగా జనాభా వివరాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత మూడు దశాబ్దాలుగా బీసీల జనాభా గణన చేపట్టాలని, జనాభా ప్రాతిపదికన బీసీలకు తగిన ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాలు, విద్యా మరియు ఉపాధి అవకాశాలు కల్పించాలని బీసీ సంఘాలు అనేక ఉద్యమాలు, కార్యక్రమాలు నిర్వహించాయని తెలిపారు.

కుల గణన చేపట్టాలనే డిమాండ్‌పై దేశవ్యాప్తంగా బీసీ సంఘాలు, సామాజిక సంస్థలు ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు కొనసాగించాయని గుజ్జ సత్యం గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించి జనగణనలో కుల గణనకు నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మక పరిణామమని అన్నారు.

కుల గణన ద్వారా దేశంలోని వివిధ సామాజిక వర్గాల జనాభా, వారి సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు అవకాశం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. వాస్తవ గణాంకాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా రూపొందించేందుకు వీలుంటుందని తెలిపారు.

ప్రత్యేకంగా బీసీ వర్గాల జనాభా ఎంత ఉందనే అంశంపై ఇప్పటివరకు వివిధ అంచనాలు, గణాంకాలు మాత్రమే ఉన్నాయని, కుల గణన ద్వారా దీనిపై స్పష్టత వస్తుందని అన్నారు. జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, తగిన ప్రాతినిధ్యం కోసం భవిష్యత్ విధానాలను రూపొందించేందుకు కుల గణన గణాంకాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

కుల గణనకు నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బీసీ వర్గాల తరఫున గుజ్జ సత్యం కృతజ్ఞతలు తెలిపారు. బీసీల దీర్ఘకాలిక డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. దేశంలో సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కుల గణన కీలకమైన అడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

కుల గణనను పారదర్శకంగా, శాస్త్రీయంగా నిర్వహించి ఖచ్చితమైన గణాంకాలను వెలువరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కుల గణన ద్వారా లభించే వివరాలను భవిష్యత్‌లో బీసీల సంక్షేమం, విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధికి సంబంధించిన విధానాల రూపకల్పనలో సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. కుల గణన నిర్ణయం దేశ చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపుగా నిలుస్తుందని గుజ్జ సత్యం పేర్కొన్నారు.

# మెట్‌పల్లిలో సురభి నవీన్ వార్డు సమస్యల పరిశీలన



గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి

కోరుట్ల నియోజకవర్గం లోని మెట్‌పల్లి పట్టణంలో 16వ వార్డు కౌన్సిలర్ వనజ మురళి పిలుపు మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ కుమార్ వార్డును సందర్శించి పలు సమస్యలను తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు బొడ్ల రమేష్, కౌన్సిలర్లు అరిగెల అనూష రాకేష్, వ్యాపారవేత్తలు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఇస్కాన్ టెంపుల్ ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమం




గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి

మెట్‌పల్లి మున్సిపల్ నర్సరీ నుండి 100 మొక్కలను పంపిణీ చేసి, రాధా గోవర్ధన ధారి మందిరం ఇస్కాన్ టెంపుల్ ఆవరణలో మొక్కలు నాటి వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ మాట్లాడుతూ చెట్లు మానవ జీవితానికి ఎంతో అవసరమని, అవి ప్రాణవాయువును అందించడంతో పాటు వాయు కాలుష్యాన్ని తగ్గిస్తాయని, భూగర్భ జలాల సంరక్షణకు, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి దోహదపడతాయని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ శ్రీ ఓంకారి నవీన్, వార్డ్ కౌన్సిలర్, కోఆప్షన్ సభ్యులు ముజీబ్, ఇస్కాన్ టెంపుల్ యాజమాన్యం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రైతు నుంచి కుటుంబానికి నాణ్యమైన కూరగాయలు

▪ ఏరువాక ఫార్మ్స్ పోస్టర్ ఆవిష్కరణలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి




కరపత్రం ప్రతినిది హైదరాబాద్, ఆగస్టు 16

రైతుల నుంచి నేరుగా నాణ్యమైన కూరగాయలు, పండ్లను సేకరించి ప్రతి కుటుంబానికి తాజా, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఏరువాక ఫార్మ్స్ పోస్టర్‌ను పెద్దమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, ప్రముఖ సామాజికవేత్త దుంద్ర కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ.. "ఆరోగ్యమే మహాభాగ్యం. ప్రతి కుటుంబం తీసుకునే ఆహారం నాణ్యమైనది, తాజాది, పరిశుభ్రమైనదిగా ఉండాలి. పొలం నుంచి నేరుగా కమ్యూనిటీ కుటుంబాలకు తాజా కూరగాయలు, పండ్లను అందించాలనే సంకల్పంతో ఏరువాక ఫార్మ్స్ ఏర్పాటు కావడం అభినందనీయమని" అన్నారు. స్థానిక రైతుల నుంచి నాణ్యమైన ఉత్పత్తులను నేరుగా సేకరించి వినియోగదారులకు అందించడం ద్వారా రైతు--వినియోగదారుల మధ్య దూరాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. "రైతుకు న్యాయమైన ధర--వినియోగదారుడికి నాణ్యమైన ఉత్పత్తి" అనే సూత్రం ఏరువాక ఫార్మ్స్‌కు ప్రధాన బలంగా ఉండాలని సూచించారు.

ఇతరుల కంటే తక్కువ ధరకు విక్రయించడం ఒక్కటే లక్ష్యం కాకూడదని, నాణ్యత, తాజాదనం, పరిశుభ్రత, పారదర్శకత విషయంలో ప్రత్యేకతను చాటుకోవాలని దుంద్ర కుమారస్వామి అన్నారు. రైతు బలపడితే వ్యవసాయం బలపడుతుందని, వ్యవసాయం బలపడితే దేశ ఆహార భద్రత మరింత పటిష్టమవుతుందని పేర్కొన్నారు.

ఏరువాక ఫార్మ్స్ లోగో రైతు ఆత్మగౌరవానికి, స్వచ్ఛమైన ఆహారానికి భరోసాకు, వినియోగదారుల నమ్మకానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. రైతుల నుంచి నేరుగా సేకరించిన సీజనల్ పండ్లు, కూరగాయలను పరిశుభ్రమైన విధానంలో కుటుంబాలకు అందించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించవచ్చన్నారు.

"పొలం నుంచి కుటుంబానికి... రైతు కష్టం నుంచి ఆరోగ్యకరమైన ఆహారం వరకు---ఇదే ఏరువాక ఫార్మ్స్ లక్ష్యం" అని దుంద్ర కుమారస్వామి పేర్కొన్నారు.

కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ దక్షిణ రాష్ట్రాల అధ్యక్షుడు కుర్మారావు, జాతీయ బీసీ దళ్ సంగారెడ్డి అధ్యక్షుడు రక్షణ, ఏరువాక ఫార్మ్స్ పర్యవేక్షణ, భాగస్వామి ఏడుకొండలు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# అన్నకు రాఖీ.. ఆత్మీయతకు ప్రతీక!

▪ పరకాల సభలో ఆత్మీయ దృశ్యం.. ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులను ఆకట్టుకున్న రక్షాబంధన్ వేడుక



కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 16

పరకాల సభలో సీఎం రేవంత్‌రెడ్డిగారికి రాఖీ కట్టిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పరకాలలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభలో ఆత్మీయత, అనుబంధం వెల్లివిరిసింది. రక్షాబంధన్ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టి శు భాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ వేడుక సభా ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాఖీ కట్టి ముఖ్యమంత్రి కి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ డా.కడియం కావ్య.. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి తనకు అన్నగా అండగా నిలుస్తూ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని రంగాల్లో సహకారం అందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. రక్షాబంధన్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో ఉండనున్న నేపథ్యంలో, పరకాల వేదికగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆయనకు ముందుగానే రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన ఈ ఆత్మీయ దృశ్యం సభకు వచ్చిన ప్రజలు, కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ ఘట్టం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# హనుమకొండలో ఘనంగా 31వ మిలాదున్నబి వేడుకలు

కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 16

హనుమకొండ: మర్కజీ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25న హనుమకొండలో 31వ మిలాదున్నబి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.వెయ్యి స్తంభాల గుడి ఎదురుగా ఉన్న జకరియా ఫంక్షన్ హాల్‌లో భారీ సభ జరగనుంది.వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం స్థానిక మదరసా బరకాతియాలో ఆవిష్కరించారు.మాజీ డిప్యూటీ మేయర్ ఖాజా సిరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ డిప్యూటీ మేయర్ మసూద్ పాషా,కాంగ్రెస్ మైనారిటీ విభాగం సీనియర్ నాయకుడు అజీజ్ మీర్జా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.మౌలానా ఖాజా జఫరుల్ ఆబేదీన్,మదరసా బరకాతియా నిర్వాహకులు మౌలానా అఫ్జల్ అలీషా తదితరులు పాల్గొన్నారు.శాంతి,సామరస్యమే సందేశం హైదరాబాద్ తర్వాత తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మకంగా మిలాదున్నబి వేడుకలు హనుమకొండలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని శాంతి,సామరస్యం,దాతృత్వం,మానవీయ విలువలను ప్రజలకు చాటడమే వేడుకల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

# మేడారంలో సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం

కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 16



ములుగు, పరకాల నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనల నిమిత్తం ఆదివారం మేడారం విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. మేడారం హెలిప్యాడ్ వద్ద వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా,కాజీపేట దర్గా పీఠాధిపతి తదితరులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో వారు మర్యాద పూర్వకంగా భేటీ అయి పలు అంశాలపై మాట్లాడారు. సీఎం పర్యటన సందర్భంగా మేడారంలో అధికారులు,ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం పలికిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 16



ములుగు జిల్లా మేడారం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘన స్వాగతం పలికారు. మేడారం హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి ఆత్మీయంగా స్వాగతించారు. అలాగే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ కి ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం పరకాల నియోజకవర్గ కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంబోత్సవాలు, శంకుస్థాపనల తర్వాత ఏర్పాటు చేసిన భారీ భహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు.

# ఉత్తమ ఉద్యోగిగా మహమ్మద్ సర్ఫరాజ్ అలీ

కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 16

జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చెందిన ఆఫీస్ సబ్‌ఆర్డినేట్ మహమ్మద్ సర్ఫరాజ్ అలీ ఉత్తమ ఉద్యోగి అవార్డుకు ఎంపికయ్యారు.హైదరాబాద్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు.ప్రస్తుతం హైదరాబాద్‌లోని డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసులో ఆఫీస్ సబ్‌ఆర్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న సర్ఫరాజ్ అలీని జిల్లా విద్యాశాఖ అధికారులు,సిబ్బంది అభినందించారు.అసిస్టెంట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి,సూపరింటెండెంట్ రాజేందర్ కుమార్,సీనియర్ అసిస్టెంట్ మంజులత,జూనియర్ అసిస్టెంట్ ఫిరోజ్ అహ్మద్ తదితరులు సర్ఫరాజ్ అలీకి శుభాకాంక్షలు తెలిపారు.

# అస్సాం సీఎంకు బెదిరింపు.. నిందితుడి అరెస్టు

రూ.కోటి ఇస్తే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ను హత్య చేస్తానని సామాజిక మాధ్యమంలో బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గువాహటి లోని ఖానాపారా వెటర్నరీ అండ్ అగ్రికల్చరల్ మైదానంలో సీఎం హిమంత బిశ్వ శర్మ శుక్రవారం మాట్లాడారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం అవుతుండగా.. లైవ్ చాట్ సెక్షన్‌లో సదరు వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు.వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడితోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆ చాట్‌లో నిందితుడు పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని మొరిగావ్ జిల్లాకు చెందిన అబ్దుల్ ముతలెబ్‌గా గుర్తించారు.

# ముగల కుమార్ యాదవ్‌కు ఘన సన్మానం

హనుమకొండ జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన షైన్ విద్యాసంస్థల అధినేత ముగల కుమార్ యాదవ్ ను బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. హనుమకొండలోని గోకుల్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో పూలగుచ్ఛం, శాలువాతో ముగల కుమార్ యాదవ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలు ఐక్యంగా ముందుకు వస్తే రానున్న రోజుల్లో బీసీలకే రాజకీయ నాయకత్వం దక్కే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ముఖ్యంగా బీసీ వర్గాల్లో అధిక జనాభా కలిగిన యాదవ సమాజం సంఘటితమై విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో మరింత పురోగతి సాధించేలా జిల్లా అధ్యక్షుడిగా ముగల కుమార్ యాదవ్ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. యాదవుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి కృషి చేయాలని, యువతలో చైతన్యం తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టే మహేందర్,

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఆగస్ట్ 17, 2026

# ఉత్తమ ఉద్యోగిగా రాధాకృష్ణ ఎంపిక

▪ మంత్రి కొండ సురేఖ మరియు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు పొందారు



**కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 16**

వరంగల్: జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి చెందిన హెల్త్ అసిస్టెంట్ పి.రాధాకృష్ణ ఉత్తమ ఉద్యోగి అవార్డుకు ఎంపికయ్యారు.ఖిలా వరంగల్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ,కలెక్టర్ డాక్టర్ సత్యశారద చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రి మలేరియా ల్యాబ్‌లో అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాధాకృష్ణను జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజిరెడ్డితోపాటు అధికారులు,సిబ్బంది అభినందించారు.

# దేశాభివృద్ధికి క్రమశిక్షణే కీలకం

▪ జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ



**కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 16**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జనయేత్రి ఫౌండేషన్ వరంగల్ ట్రైసిటీస్ ఆధ్వర్యంలో 18వ డివిజన్ లేబర్ కాలనీలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఫౌండేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రహీం ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..1947 ఆగస్టు 15న బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు.దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో కులమతాలకు అతీతంగా ఎంతోమంది మహనీయులు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు.వారి త్యాగాల ఫలితంగా లభించిన స్వాతంత్ర్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దేశం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందకపోవడానికి ప్రజల్లో క్రమశిక్షణ లోపం కూడా ఒక ప్రధాన కారణమని అన్నారు.మనకంటే తర్వాత స్వాతంత్ర్యం పొందిన కొన్ని దేశాలు అభివృద్ధిలో ముందుకు సాగాయని తెలిపారు.దేశాభివృద్ధికి ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరిస్తూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అన్నదానం.. వస్త్రాల పంపిణీ



**కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 16**

వరంగల్: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ సామాజిక సంస్కర్త పెసరు తిలక్‌కుమార్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం,వస్త్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.రోడ్డుపై బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న నిరుపేదలకు భోజనం అందించడంతోపాటు పంచెలు,ఇతర వస్త్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తిలక్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలోని నిరుపేదలకు తమవంతుగా సహాయం అందించాలనే ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.సేవా కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమం విజయవంతం కావడంలో ఇండ్ల కిరణ్‌కుమార్,గణేష్,రాకేష్,భువనేశ్వర్,వర్ధన్,తేజ,యశ్వంత్ తదితరులు సహకరించారు.

# చైతన్య భూమిలో విశ్వ జ్ఞానులకు పూల మాలలు

▪ ముఖ్య అతిథి : జయమయ్య దంపతులు





**కరపత్రం ప్రతినిధి ఆగస్టు 16,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా.**

మల్కాజ్గిరి మున్సిపల్ కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ లోని రాజీవ్ గృహ కల్ప కాలనీ లోని మాల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో చైతన్య భూమి వద్ద ఉన్న మహా నీయులు మహాత్మా జ్యోతి రావ్ పూలే, బాబా సాహెబ్ డాక్టర్, బి, ఆర్, అంబెడ్కర్ విగ్రహాలకు ప్రతి ఆదివారం జరిగే పూల జరుగుతుంది, ఈ వారం 32 మరియు 232 జ్ఞాన మాల కార్యక్రమనికి వచ్చిన ముఖ్య అతిథిలుగా జయమయ్య దంపతులు అ మహానుభావులకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం వారికీ మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో షాల్వాతో సతక్కరించారు ,ఈ సందర్బంగా సంఘం సలహాదారులు తాడేపల్లి అబ్బులు మాట్లాడుతూ ఈ చైతన్య భూమి వేదికలో ఉన్న మహానుభావులు మహాత్మ జ్యాతీరావు పూలే, డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళు లు అర్పించడానికి పిలువగానే వచ్చిన జయమయ్య దంపతులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాల సంఘం అధ్యక్షులు కోలాటి,రాజు, మలమాహానాడు మేడ్చల్ అధ్యక్షులు గుజ్జుక పర్శురాం, మోతె రాజేంద్ర ప్రసాద్, పాడుగుల రూప చంద్రమౌళి,చెన్నయ్య,జగన్నాద్,బత్తుల శ్రీనివాస్, పోతుల వెంకటేష్, కనుకయ్య, జనార్దన్,అప్పారావు ,మరియు మాల కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమన్ని విజయవంతం చేసారు.

# రాజీవ్ గృహ కల్ప కాలనీ జ్ఞాన కేంద్రం లో మహనీయులకు పూల మాలలు

▪ అంబేద్కర్ విద్య ద్వారా దేశానికి వెలుగు నింపారు

▪ ముఖ్యఅతిధి సతూరి సంపత్





**కరపత్రం ప్రతినిది ఆగస్టు 16,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా.**

మాల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ లోని రాజీవ్ గృహ కల్ప కాలనీ లోని జ్ఞాన కేంద్రం లోని మహనీయులు డాక్టర్,, బి, ఆర్, అంబెడ్కర్ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్, బి, ఆర్ అంబెడ్కర్, డాక్టర్,, జాగ్జీవన్ రామ్ విగ్రహాలకు ప్రతి ఆదివారం పూలమాల కార్యక్రమం జరుగుతుంది ఈ 29 వ పూలమాల కార్యక్రమనికి సతూరి సంపత్ ముఖ్యఅతిధిగా హాజరై ఆ మహానుభావుల కు పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం అంబెడ్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి ఉల్లి సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమలో అంబెడ్కర్ సంఘం అధ్యక్షులు డాక్టర్ గోల్లూరి రాజు, సంఘం సలహాదారులు మంగళపురి వెంకటేష్ (మాజీ కౌన్సిలర్) సలహా దారులు స్వామి, పాడుగుల చంద్రమౌళి మాట్లాడుతూ అంబెడ్కర్ సంఘం పునర్నిర్మానం పూలమాల (జ్ఞానమాల ) తోపాటు మనతో పాటు నివాసం ఉంటున్నా ప్రజల అవసరాలు తెల్సుకొని సహాయ సహకారాలు చేయాలి అని చెప్పుతూ డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ముఖ్య అతిధికి సతూరి సంపత్ కు షాల్వాతో సన్మానం చేసి ఎవరు ఈ అంబెడ్కర్ అనే పుస్తకాన్ని బహుకరించారు.

అనంతరం ముఖ్యతిదీ సంపత్ మాట్లాడుతూ డాక్టర్, బి ఆర్ అంబేద్కర్ భారతదేశానికి చేసిన అత్యంత గొప్ప సేవ రాజ్యాంగ నిర్మాణం అయితే ఆయన విదేశాలలో చదువుకుని, తిరిగి వచ్చి దేశానికి ఇచ్చిన ముఖ్యమైన కానుకలు, భారతదేశ సామాజిక-ఆర్థిక సమస్యలకు పరిష్కారాలు సూచించారు.

భారత రాజ్యాంగం రచనలో ప్రధాన పాత్ర పోషించి, దేశానికి ప్రజాస్వామ్య, సమానత్వ, న్యాయబద్ధమైన పాలనా వ్యవస్థను అందించారు.

దళితులు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడి, అస్పృశ్యత నిర్మూలనకు కృషి చేశారు.

మహిళా హక్కులు, కార్మిక హక్కులు, విద్య హక్కు వంటి అంశాలలో చట్టాలు రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు,

విద్య అనేది మనిషికి ఇచ్చే అత్యంత గొప్ప ఆయుధం అని అంబేద్కర్ నమ్మారు. కష్టపడి చదివి, తన జీవితాన్ని మార్చుకున్నారు.

కుల వివక్ష, అసమానత్వానికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడరు,

ఫలితాల గురించి కాకుండా, కర్తవ్యం మీదనే దృష్టి పెట్టరు అని అన్నారు, ఈ గొప్ప కార్యక్రమనికి నన్ను గుర్తించి ఆ మహానుభావులకు పూలమాలలు ఘనంగా నివాళులు అర్పించే అవకాశం ఇచ్చిన నా అంబెడ్కర్ సంఘానికి ధన్యవాదములు అన్నారు.

ఈ కార్యక్రమలో గాదె రామకృష్ణ, జనార్దన్, కన్నయ్య, సదా, డి నాగేశ్వరావు, ఆటో రాజయ్య, ఖాదీర్ బాయ్, ఆటో సోదరులు మరియు కాలనీ ప్రజలు పాల్గొని కార్యక్రమం విజయ వంతం చేశారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు వెలమ సంక్షేమ సంఘం భరోసా



▪ రూ.12.20 లక్షల స్కాలర్‌షిప్‌లు.. 65 మంది ప్రతిభావంతులకు పురస్కారాలు

▪ ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి అండగా ఉంటాం – డా. నడిపెల్లి వెంకటేశ్వర్ రావు

▪ విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యం – ఎన్నమనేని జగన్ మోహన్ రావు









**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 16**

విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూతనందించాలనే లక్ష్యంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాలు–స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం ఆదివారం వీఎస్ఎస్ ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, సంఘ ప్రతినిధులతో కళకళలాడిన ఈ కార్యక్రమం విద్యా ప్రోత్సాహానికి ప్రతీకగా నిలిచింది. వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ లయన్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్ మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు, ఆర్థికంగా అవసరమైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా 65 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, విద్యలో మెరుగైన ఫలితాలు సాధిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న 215 మంది విద్యార్థులకు మొత్తం రూ.12,20,000 విలువైన స్కాలర్‌షిప్‌లను అందజేశారు. విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక చేయూత అందించడం ద్వారా సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలనే సంఘం సంకల్పాన్ని మరోసారి చాటిచెప్పింది. ముఖ్య అతిథి ఎన్నమనేని జగన్ మోహన్ రావు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అనేది సమాజ భవిష్యత్తులో పెట్టుబడి పెట్టినట్టేనని అన్నారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని, ప్రతి విద్యార్థి తన కలలను సాకారం చేసుకునేలా సమాజం అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. విద్య ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకున్న యువత సమాజాభివృద్ధికి దోహదపడాలని సూచించారు. అధ్యక్షులు డా. నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, విద్యే వ్యక్తిత్వ వికాసానికి, సమాజ పురోగతికి మూలాధారమని అన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకుండా చూడటం సంఘం బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో మరింత ఎక్కువ మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేలా సంఘం కార్యాచరణ కొనసాగుతుందని వెల్లడించారు.

స్కాలర్‌షిప్‌లు, పురస్కారాలు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వెలమ సంక్షేమ సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు అందుతున్న ఈ ప్రోత్సాహం వారి భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులతో పాటు 500 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం హాజరైన వారందరికీ సంఘం ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. విద్య, సేవ, సామాజిక బాధ్యతలను సమన్వయం చేస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం వివిధ జిల్లాల నాయకులు, మహిళా నాయకురాళ్ళు, కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోంది: ఎంపీ డాక్టర్ కడియం కావ్య



▪ పరకాల నియోజకవర్గానికి రూ.400 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

▪ వరంగల్‌ను రెండో రాజధానిగా తీర్చిదిద్దే దిశగా రూ.6,500 కోట్ల ప్రాజెక్టులు: ఎంపీ





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 16**

ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ప్రజా పాలన--ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం పరకాల నియోజకవర్గంలో సుమారు రూ.400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడారు. పరకాల నియోజకవర్గానికి భారీ స్థాయిలో అభివృద్ధి నిధులు మంజూరు చేయడం ఆనందదాయకమని పేర్కొన్న ఆమె, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్ల క్రితం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పగించారని, అప్పటి నుంచి ప్రభుత్వం సంక్షేమం--అభివృద్ధిని సమతుల్యంగా అమలు చేస్తోందని అన్నారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ నాయకత్వానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల సాధనలో తగిన స్థాయిలో కృషి జరగలేదని విమర్శించిన ఎంపీ, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను పలుమార్లు కలిసి వరంగల్ అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులు, నిధుల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

ఆ ప్రయత్నాల ఫలితంగానే మామునూరు విమానాశ్రయం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు వరంగల్‌కు లభిస్తున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేసే లక్ష్యంతో సుమారు రూ.6,500 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు సమకూరుతున్నాయని ఎంపీ వెల్లడించారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. మహిళల కోసం సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయడంతో పాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా, ఆర్టీసీ బస్సుల యాజమాన్యంలో భాగస్వాములుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం విశేషమన్నారు.

గత ప్రభుత్వాల పాలనలో రాష్ట్రంపై భారీ రుణభారం పడినప్పటికీ, ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఎక్కడా ఆపకుండా కొనసాగిస్తోందని ఎంపీ పేర్కొన్నారు. పేదలకు సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రానున్న రెండేళ్లలో మరిన్ని సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న ఎంపీ, పరకాలతో పాటు వరంగల్ ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు కల్పించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.